నవతెలంగాణ
ఆదిలాబాద్
సోమవారం | జూన్ 10, 2024 | www.navatelangana.com

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-కడెం



మండల కేంద్రంలోని స్థానిక హరిత రిసార్ట్‌లో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2001-02 బ్యాచ్ పదో తరగతి సభ్యులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అందరూ ఒక చోట చేరారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను నేమరువేసుకున్నారు.

ఉచిత శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కుభీర్

గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడలని భైంసా పిల్లల వైద్య నిపుణులు బందెల నరేష్ అన్నారు. ఆదివారం మండలంలోని పార్డి(బి) గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న 14 సంవత్సరాలు వయస్సు గల పిల్లలకు పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు బందెల నరేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద మధ్య తరగతి ప్రజలకు తక్కువ ఖర్చుతో కూడిన వైద్య సదుపాయం కల్పించి, పేద మధ్య తరగతి ప్రజలకు వైద్య సదుపాయం కల్పించేలా కృషి చేస్తామని అన్నారు. దీంతో గ్రామంలో ఉన్న 150 మంది చిన్న పిల్లలకు ఉచిత వైద్యం అందించి, మందులు సరఫరా చేశారు. మండలంలోని పార్డి(కె) గ్రామానికి చెందిన బందెల నరేష్‌ను మాజీ సర్పంచ్ తూము పుష్పలత రాజేశ్వర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పోతన్న, శివలింగం తుకారాం, గణేష్, నారాయణ, సురేష్ బాబు, గ్రామస్తులు ఉన్నారు.

జూన్ సంకటం ..!

- పంట పెట్టుబడి..పుస్తకాల కొనుగోలు
- ఈ నెలలోనే ఖర్చులు తడిసిమోపెడు
- రైతులు, చిరుద్యోగులకు తప్పని అదనపు భారం
- ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్న బడులు

ఏడాదిలో 11 నెలలను ఒకలా చూస్తే.. జూన్ నెలను మాత్రం ప్రత్యేకంగా చూస్తారు. ఈ నెల వచ్చిదంటే తల్లిదండ్రుల్లో ఒక రకమైన ఆందోళన మొదలవుతుంది. చిరుద్యోగులు, రైతులు ఈ నెల రాకముందే డబ్బుల కోసం సతమతమవుతుంటారు. అటు పంటకు.. ఇటు చదువుకు ఒకే సారి ఖర్చు చేయాల్సి రావడంతో సగటు వేతన జీవులు ఇబ్బందులు పడుతుంటారు. పంట కోసం పెట్టుబడి రూపంలో డబ్బులు జమ చేసుకోవడం.. పిల్లల చదువు కోసం పుస్తకాలు, దుస్తులు కొనుగోలు చేయడమే కాకుండా.. ఫీజులు చెల్లించాల్సి రావడంతో ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నారు. గత్యంతరం లేని పరిస్థితి కావడంతో చాలా మంది అప్పులు తీసుకొచ్చి వీటి కోసం ఖర్చు చేస్తున్నారు. ఒకే సమయంలో రెండింటికి ఖర్చు చేయాల్సి రావడంతో ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క ప్రయివేటు బడుల్లో పెరిగిన ఫీజులతోనూ తీవ్రంగా సతమతమవుతున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రతి ఏటా జూన్ నెల వచ్చిందంటే తల్లిదండ్రుల్లో ఒకటే భయం ఉంటుంది. ముందస్తుగానే ఈ నెలలో ఖర్చు భరించడం ఎలా అని మదనపడుతుంటారు. ఎందుకంటే చాలా మంది చిరుద్యోగులు, సగటు వేతన జీవులకు ప్రతి నెలా ఒక ఫిక్స్‌డ్ వేతనం ఉంటుంది. వారికి వచ్చే అరకొర వేతనంతోనే ఇంటికి అవసరమైన సరకులు, అద్దెలు, ఇతరాత్ర బిల్లులు చెల్లించడం, రోజువారీ ఖర్చులకు ఒక లెక్క వేసుకొని ఖర్చు చేస్తుంటారు. వారికి వచ్చే వేతనంలోనూ సర్దుబాటు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. కానీ జూన్ నెలలో మాత్రం అదనపు ఖర్చులు ఉండటంతో వీటిని భరించడం ఇబ్బందికరంగా మారుతోంది. వచ్చే వేతనంలో రోజువారీ అవసరాలు పోగా.. అదనంగా పిల్లలకు పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు తదితర వాటిని ఖర్చు చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా ప్రయివేటు విద్యా సంస్థల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులపై మరింత భారం పడుతోంది. కేవలం ఒకటో తరగతి పాఠ్య, నోటు పుస్తకాలు కొనుగోలు చేయాలంటేనే కనీసం రూ.3వేల నుంచి రూ.4వేల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. స్కూల్ డ్రెస్, ఇతరాత్ర పిల్లల అవసరాలకు మరో రూ.2వేల వరకు, ఇక డోనేషన్లు, అడ్మిషన్ ఫీజుల రూపంలో మరో రూ.10వేల వరకు అదనంగా వెచ్చించాల్సి వస్తోంది.



రైతులకు మరింత భారం..!

ఈ నెలలో రైతులు మరింత ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నారు.చాలా మంది రైతులు వారి పిల్లలను ప్రయివేటు పాఠశాలల్లో చేర్పిస్తుండటంతో వారికి ఈ నెలలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలుతో పాటు ప్రత్యేకంగా పిల్లల చదువు కోసం డబ్బులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. దీంతో ఒకే నెలలో రెండింటి కోసం ఖర్చు చేయాల్సి రావడంతో అదనపు భారం భరించలేక అవస్థలు పడుతున్నారు. పంట పెట్టుబడితో పాటు చదువుకు సైతం అదే రూపంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. మరోపక్క ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు పాఠ్య, నోటు పుస్తకాలు ఉచితంగా అందజేస్తుండటంతో కొంత ఉపశమనం కలుగుతోంది.

ఫీజుల భారంతో సతమతం..!

ఈ నెల 12వ తేదీ నుంచి జిల్లాలో పాఠశాలలు పున ప్రారంభమవుతాయి. ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజుల మోత తల్లిదండ్రులకు భారంగా మారుతోంది. కొన్ని ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు భారీగా ఫీజుల రూపంలో వసూలు చేయడంతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతోంది. పిల్లలను ప్రయివేటులో చదివించాలనే ఉద్దేశంతో అనేక మంది ఎంత కష్టమైనా భరిస్తున్నారు. ఇదే అదనుగా తీసుకుంటున్న కొన్ని ప్రయివేటు విద్యా సంస్థలు భారీగా వసూలు చేస్తున్నాయి. ఫీజు నిర్ణయాత్మక కమిటీలు వేయాల్సి ఉన్నా అలాంటి నిబంధనలు పట్టించుకోవడం లేదు. ఒకటో తరగతికే రూ.20వేల వరకు వసూలు చేస్తుండగా.. పై తరగతులకు వెళ్లే కొద్దీ ఫీజులు సైతం పెంచుతూ పోతున్నారు. పదో తరగతి వరకు కనీసం రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొత్తగా పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తే డొనేషన్లు, అడ్మిషన్ ఫీజుల రూపంలోనూ భారీగా వసూలు చేస్తున్నాయి.

ఆర్థిక భారంతో సతమతం

-బర్కుంట అశోక్, అడెగామ(కె)



జూన్ నెల వచ్చిందంటే భయపడాల్సి వస్తోంది. పంట పెట్టుబడి కోసం ఖర్చు చేయాల్సి రావడంతో పాటు పిల్లల చదువులకు కూడా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ రెండు పనులు ముఖ్యమైనవే. మరోపక్క ఫీజులు పెరగడంతో పాటు పుస్తకాల ధరలు పెరగడం సామాన్యులకు ఇబ్బందికర పరిస్థితిగా మారుతోంది.

పార్టీ కోసం కష్టపడి పని చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీ గెలుపు, అభివృద్ధి కొరకు నిర్దిష్టంగా ప్రజల్లో ఉంటూ ప్రజల సేవ చేస్తానని అన్నారు. అధిష్టానం నిర్ణయం ప్రకారమే పనులు చేస్తానని అన్నారు. ఎంపీ అభ్యర్థిగా గెలుపు కోసం మంత్రి సీతక్క, సత్తు మల్లేష్‌లు నాకోసం పనులు చేశారని తెలిపారు. వీరే నాకు టికెట్ ఇప్పించారని అన్నారు. మంత్రి ఉండి ఒక కార్యకర్తలా పని చేశారని, నా ఓటమి లోటు పాటును అధిష్టానమే చూసుకుంటుందని అన్నారు. ఇన్‌చార్జ్ డీసీసీ, నాయకులు, కార్యకర్తలు ఎవరి కోసం ఏం చేశారనేది అధిష్టానం కోరుతుందని అన్నారు. గతం కంటే ఈ సారి ఓట్లు కాంగ్రెస్‌కు పెరిగిందని, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి భారీగా కాంగ్రెస్‌లో చేరికలు చేశామని అన్నారు. వారు పార్టీ కోసం పని చేశారా లేదా అనేది పార్టీ తెలుసుకుంటుంది. నాయకులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి లోటు పాటును సరి చేసుకుంటామని అన్నారు. ఓడిపోయిన అనంతరం అధిష్టానానికి ఎలాంటి నివేదికలు సమర్పించలేదని సొంతంగా నేనే ఒక సారి వెళ్లి ముఖ్యమంత్రిని కలిసి వస్తానని తెలిపారు. గెలుపు, ఓటమి అనేది సహజమేనని నాయకులు, కార్యకర్తలు తమ పనులను పార్టీ కోసం కష్టంతో కాకుండా ఇష్టంతో పని చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కయ్యూమ్, ఎస్టీ సెల్ జిల్లా కన్వీనర్ జాదవ్ సునీల్, బ్లాక్ జిల్లా అధ్యక్షులు ఇక్బాల్, ఎస్సీ సెల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి చంద్రయ్య, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు సలీం, పాక్స్ చైర్మెన్ ఎస్పీరెడ్డి, జిల్లా నాయకురాలు రాజ్ మణి, రాధా బాయి, రాజమ్మ, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అపూర్వం పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 1995-96 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి మిత్రులందరూ ఒక చోట చేరి ఒకరినొకరు అలింగనం చేసుకొని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి, శాలువాతో ఘనంగా సన్మాంచారు. చిన్ననాటి జ్ఞాపకాలను నేమరువేసుకున్నారు. అదేవిధంగా మండలంలోని కనకపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2006-07 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను సన్మానించి, చిన్ననాటి జ్ఞాపకాలను నేమరువేసుకున్నారు. ఆ రోజంతా పాఠశాలలో ఆనందంగా గడిపారు.

రామోజీరావు చేసిన సేవలు మరువలేనివి

- రామోజీకి ఘన నివాళ్లు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మీడియా దిగ్గజం ఈనాడు, ఈటీవీ సంస్థల అధినేత రామోజీరావు మృతికి సంతాపంగా కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళ్లర్పించారు. ఆదివారం పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామోజీరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన సేవలను కొనియాడారు. ముందుగా ఆయన మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. తెలుగు కీర్తిని, స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన రామోజీరావు మరణం ఈ దేశానికి, ముఖ్యంగా తెలుగుజాతికి తీరని లోటని పేర్కొన్నారు.

సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో నివాళ్లు

సీపీఐ పార్టీ జిల్లా కార్యాలయంలో రామోజీరావు సంతాప సభను ఆదివారం నిర్వహించారు. ముందుగా సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణాజిల్లాలో పుట్టినప్పటికి హైదరాబాద్‌కు జీవనోపాధి కొరకువచ్చారని అన్నారు. కమ్యూనిస్టు పార్టీలో పని చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బెజ్జంకి నర్సింగరావు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పొచ్చారాం గెడం, సీపీఐ సీనియర్ నాయకులు కట్కోజి స్వామి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జగన్నాథ్ పాల్గొన్నారు.

హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో...

ఈనాడు, ఈటీవీ సంస్థల అధినేత రామోజీరావు పత్రిక రంగానికి చేసిన సేవలు మరవలేనివని సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ ఖత్రి అన్నారు. ఆదివారం రామోజీరావు సంతాప సభను ఏర్పాటు చేశారు. రామోజీరావు చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి ఘన నివాళు లర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి మాట్లాడుతూ రామోజీరావు చూపిన మార్గం సదా ఆచరనీయమని అన్నారు. ఆధ్యాత్మికతకు ఆయన పెద్ద పీట వేసేవారని, కార్తిక దీపోత్సవం వంటి కార్యక్రమాలతో భక్తి భావాన్ని పెంపొందించారని పేర్కొన్నారు. ఆ కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకునే సమితి ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవాలను అట్టహాసంగా జరుపుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గేడం మాధవ్, నర్సాగౌడ్, సూర్యకాంత్, పార్థసారథి, హన్మండ్లు యాదవ్, సంతోష్, సుభాష్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో గ్రూప్ 1 పరీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్ వన్ ప్రిలిమినరీ పరీక్షా జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరిగింది. గ్రూప్ వన్ కోసం సంసిద్ధం అవుతున్న అభ్యర్థులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న పరీక్షకు సంబంధిత అధికార యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేశారు. అభ్యర్థుల కొరకు జిల్లా వ్యాప్తంగా 18 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులను కల్పించేలా తగు చర్యలు తీసుకున్నారు. టీజీపీఎస్సీ ద్వారా జరుగుతున్న పరీక్ష నిర్వహణపై జిల్లా కలెక్టర్ రాజర్షిషా గత కొన్ని రోజులుగా ప్రత్యేక దృష్టి సారించారు. అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ దిశా నిర్దేశం చేశారు. అటు జిల్లా ఎస్పీ గౌస్ అలంసైతం భద్రత పరంగా చర్యలు సమావేశాలు నిర్వహించి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు.

కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

ఆదివారం ఉదయం 10.30 నిమిషాల నుంచి ఒంటి గంట వరకు గ్రూప్ వన్ పరీక్ష కొనసాగింది. మొత్తం 6,729 మంది అభ్యర్థులకు గానూ 5,469 మంది హాజరు కాగా, 1260 మంది గైర్హాజరయ్యారు. నిమిషం నిబంధన అమల్లో ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు ఉదయం 8 గంటల నుండే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. 9 గంటల నుంచి అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. ఎలాంటి పరికరాలను, వస్తువులను లోనికి అనుమతించలేదు. కాగా పరీక్ష కేంద్రాల వద్ద ఎక్కడ ఎటువంటి అవాంచనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద భారీకెడ్లు ఏర్పాటు చేసి 144 సెక్షన్ విధించారు. కేంద్రాల్లో



పాటించాల్సిన నియమ నిబంధనలపై అభ్యర్థులకు హాల్ టికెట్లపై స్పష్టమైన సూచనలు జారీ చేశారు.

పరీక్ష కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ

జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాజర్షిషాతో పాటు ఎస్పీ గౌస్ ఆలం పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఎప్పటికపుడు పరిస్థితులను పర్యవేక్షిస్తూ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. రూమ్ టూ రూమ్‌ను సందర్శిస్తూ సిబ్బందిని, అభ్యర్థులతో మాట్లాడారు. కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని సూచించారు.

భద్రత నడుమ గ్రూప్ 1 పరీక్ష నిర్వహణ..

ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ గ్రూప్ వన్ పరీక్ష ప్రశాంతంగా ముగిసేలా అవసరమైన పూర్తి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కేంద్రాల సమీపంలో 144 సెక్షన్‌ను అమలు చేయడం జరిగిందని వివరించారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించడం లేదని, ఈ విషయాలపై హాల్ టికెట్లపై స్పష్టమైన సూచనలు ఉన్నట్లు తెలిపారు. అన్ని కేంద్రాల్లో పరీక్షా ప్రశాంతంగా సాగిందని వెల్లడించారు. అదేవిధంగా ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ గ్రూప్ వన్ పరీక్షా జరుగుతున్న 18 పరీక్ష కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కేంద్రాల చుట్టుపక్కల జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలను మూసివేసినట్లు పేర్కొన్నారు. చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరికీ మొబైల్ ఫోన్‌లను అనుమతించలేదని వెల్లడించారు. పరీక్ష నిర్వహణలో ఆదిలాబాద్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు, అబ్జర్వర్లు, సిబ్బంది ఉన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వం వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పాఠశాలలు పున్ణ ప్రారంభం నాటికి స్కావెంజర్లను నియమించాలని ఎస్టీయూ సంఘం జిల్లా అధ్యక్షుడు మూగ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఎస్టీయూ 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయం ఘనంగా నిర్వహించారు. ముందుగా అధ్యక్షులు మూగ శ్రీనివాస్ ఎస్టీయూ పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ పొందిన సీనియర్ నాయకులు పోలాజి కిషన్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో అధ్యక్ష,కార్యదర్శులు మూగ శ్రీనివాస్, జాదవ్ అశోక్ మాట్లాడుతూ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలే లక్ష్యంగా, విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా, ఉపాధ్యాయ హక్కుల సాధన కోసం 9 జూన్ 1946న ఎస్టీయూ ఆవిర్భవించి, నేటితో 78వ వసంతంలోకి అడుగుపెట్టిందన్నారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం శాస్త్రీయమైన ప్రతిపాదనలతో ప్రభుత్వానికి అవసరమైన సూచనలు చేస్తూ, విద్యారంగ సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగా, సకాలంలో పూర్తి చేయాలని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు వెంటనే బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న సీఆర్టి ఉపాధ్యాయులకు ప్రతినెల వేతనాలు విడుదల చేయాలని, 317 జీఓ ద్వారా స్పౌజ్ కేటగిరీలో బ్లాక్‌లో ఉన్న 13 జిల్లాలను వెంటనే అన్ బ్లాక్ చేస్తూ, అప్పీలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించిట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బెజ్జంకి రవీంద్ర, శీతల్ చౌహన్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి దిలేష్ చౌహన్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జాదవ్ రవికుమార్, బానోత్ ఆత్మారాం, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి మల్లేష్, జిల్లా కార్యదర్శి షేక్ మునీర్, వివిధ మండలాల బాధ్యులు చంద్రశేఖర్, ఎస్.అశోక్, గుమ్మడి సురేష్, ప్రేమ్‌దాస్, దినేష్, హర్షవర్ధన్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

విద్యుద్ఘాతానికి గురై ఒకరు మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

విద్యుద్ఘాతానికి గురై ఒకరు మృతి చెందిన సంఘటన ఆదిలాబాద్ మండలంలో యాపల్‌గూడలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని విద్యుత్ స్తంభం ఎక్కి పనులు చేస్తుండగా ఒకేసారి విద్యుత్ సరఫరా అయి విద్యుద్ఘాతానికి గురయ్యాడు. మృతుడి భార్య ప్రతిభ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు, మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నట్టు ఎస్సై ముజాహిద్ తెలిపారు.



వర్షం పడితేనే విత్తనాలు విత్తుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

వర్షం పడితేనే విత్తనాలు విత్తుకోవాలని డీఏఓ పుల్లయ్య అన్నారు. ఆదివారం మండలంలోని పొచ్చర గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వర్షం పడిన తర్వాత విత్తనాలు విత్తుకొని లాభదాయకంగా పంటలు తీసుకోవాలని కోరారు. రైతులు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధిక ధరలకు విత్తనాలు కొనుగోలు చేయద్దని తెలిపారు. విత్తనాల సీడ్స్ షాపుల్లో రశీదు తీసుకొని జాగ్రత్త ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఆశ్రాఫ్, ఏఈఓ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా బిర్సాముండా వర్ధంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఘనంగా బిర్సాముండ 124వ వర్ధంతిని మావల మండలంలోని కుమురం భీం కాలనీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గోడం గణేష్ మాట్లాడుతూ క్రాంతివీర్ భగవాన్ బిర్సా ముండ తొలితరం ఉద్యకారుడని ఆయనను స్మరిస్తూ ఆయనా చేసిన పోరాటాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, జిల్లా సహాయ కార్యదర్శి సోయం లలిత, తుడుం దెబ్బ మావల మండల అధ్యక్షులు వేద్మ ముకుంద్‌రావు, యువజన సంఘం జిల్లా నాయకులు కొట్నాక్ ఆనంద్, రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు ఆత్రం భుజంగరావు, మెస్రం తులసి రామ్ డివిజన్ ఉపాధ్యక్షులు, తోడసం ప్రకాష్ డివిజన్ నాయకులు, కొట్నక్ రామరావు, వెట్టి బొజ్జు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | జూన్ 10, 2024 | www.navatelangana.com

రైతులకు పంట సాగుపై అవగాహన

నవతెలంగాణ-బోథ్



మండలంలోని పంటలు సాగు చేస్తున్న రైతులకు రైతు వేదిక ద్వారా పంటల సాగుపై అవగాహన కల్పించాలని బోథ్ మండల మహాత్మ జ్యోతి పూలే సంఘం అధ్యక్షుడు గాజుల పోతన్న అన్నారు. ఆదివారం మండలంలోని సొనాల గ్రామంలో కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పంటల సాగుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలని అన్నారు. దీనికి వ్యవసాయాధికారులు యాజమాన్య పద్ధతులపై రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు అంబలి పంపిణీ

నవతెలంగాణ-ఉట్నూర్



లక్కారం గ్రామపంచాయతీ పరిధిలోని ఉపాధి హామీ కూలీలకు లక్కారం, వేణునగర్, గంగన్నపేట, నవోదయనగర్, చత్రునగర్ గ్రామ ప్రజలకు గత ఉపాధి హామీ పనులు ప్రారంభం అయినప్పటి నుంచి చివరి రోజు వరకు అంబలి, మజ్జిగ పంపిణీ చేసిన సామాజిక కార్యకర్త అజ్మీరా జయచంద్ర ఆదివారం రోజు వారికీ అంబలితో పాటు సమోసాలను అందించారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడారు. గత కొన్ని రోజులుగా మాకు అందించిన మీ సహకారానికి రుణపడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సుశీలమ్మ, కుమ్మరి సంఘ రాష్ట్ర నాయకులు తొగరి రఘు, గంట విజయ్, గంగాధర్, జాడి సుమన్, మాడవి శ్యామ్, పవన్, శివ సాయి ఉన్నారు.

కల్లాలు లేక..కష్టాలు తీరక..!

- తునికాకు సేకరిస్తున్నా..విక్రయించే మార్గం లేదు
- మార్కెట్ సౌకర్యం లేక కూలీల అవస్థలు
- అధికారులు స్పందించాలని విజ్ఞప్తి

నవతెలంగాణ- ఆదిలాబాద్ రూరల్

రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు వారివి. రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే నిరుపేదలు వారు. ఏటా వేసవి సీజన్‌లో ఇతర పనులు లేకపోవడంతో తునికాకు సేకరణపై ఆధారపడుతూ కుటుంబాన్ని పోషించుకుంటారు. తునికాకు సేకరించి కట్టలుగా మార్చుతున్నా..వాటిని విక్రయించే మార్గం లేక అవస్థలు పడుతున్నారు. బీడీలు చుట్టేవారు వచ్చి కొనుగోలు చేసే వరకు వీటి తునికాకు విక్రయించడం సాధ్యం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్లాలు అందుబాటులో లేకనే తునికాకు సేకరణకు అనేక మంది దూరమవుతున్నారు. ప్రభుత్వం,అధికారులు స్పందించి స్థానికంగా కల్లాలు ఏర్పాటు చేస్తే సేకరించిన తునికాకును సులువుగా విక్రయించేందుకు అవకాశం ఉంటుందని కోరుతున్నారు.

ఉదయమే అడవికి వెళ్లి..!

ఆదిలాబాద్ రూరల్ మండలం చుట్టూ అటవీ ప్రాంతం అధికంగా ఉంది. ఇక్కడ ఎక్కువగా ఆదివాసీలు, ఇతర నిరుపేదలకు అధికంగా జీవిస్తుంటారు. ఇతర సీజన్లలో వ్యవసాయ కూలీలుగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా.. వేసవిలో మాత్రం ఆయా పనులు లేకపోవడంతో జీవనం సాగించేందుకు ఇబ్బందికరంగా మారుతోంది. ఆర్థిక సమస్యలు చుట్టుముడుతుండటంతో అనేక మంది నిరుపేదలు తునికాకు సేకరణను ఆదాయ వనరుగా మార్చుకుంటారు. తెల్లవారుజామునే అడవికి వెళ్లి తునికాకు సేకరిస్తుంటారు. మావల, వాఘాపూర్‌తో పాటు ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మాలేబోరిగాం, చించుఘాట్, పందిర్‌లొద్ది, అంకాపూర్, పిప్పల్‌ధరి, లోకారి, వాన్వట్, సల్పలగూడ తదితర గ్రామాలకు చెందిన అనేక మంది ప్రజలు ఈ ఏటా ఈ తునికాకు మీదనే ఆధారపడుతుంటారు. ఇందులో కొన్ని గ్రామాలకు చెందిన వారు ఇతర ప్రాంతాల్లో ఉండే కల్లాల వద్దకు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. కానీ మరికొన్ని గ్రామాలకు చెందిన వారు అక్కడికి వెళ్లలేక ఇంట్లోనే నిల్వ ఉంచుతున్నారు. స్థానికంగా బీడీలు చుట్టే కార్మికులు వీరి వద్దకు వచ్చి తునికాకు కట్టలను కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తోంది. వీరు రాకుంటే సేకరించిన తునికాకు వృధాగానే మిగిలిపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్లాలు అధిక ధర వస్తుందని..అవి అందుబాటులో లేకపోవడంతో నష్టపోవాల్సి వస్తోందని చెబుతున్నారు.



గిట్టుబాటు ధర రావడం లేదు

తోకల గంగమ్మ, మావల



వేసవిలో పనులు లేకపోవడంతో తునికాకు మీదనే ఆధారపడుతుంటాం. తెల్లవారుజామునే అడవికి వెళ్లి చెట్టుచెట్టుకు వెళ్లి తునికాకు సేకరిస్తుంటాం. కానీ కల్లాలు లేకపోవడంతో విక్రయించడానికి ఇబ్బందులు పడుతున్నాం. బీడీలు చుట్టే వారికి విక్రయిస్తే గిట్టుబాటు ధర రావడం లేదు. అధికారులు స్పందించి స్థానికంగా కల్లాలు ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకోవాలి.

కల్లాలు ఏర్పాటుచేయాలి

మల్లమ్మ, మావల



మేము ప్రతి ఏటా తునికాకు సేకరిస్తున్నా కల్లాలు లేకపోవడంతో విక్రయించడం ఇబ్బందిగా మారుతోంది. కల్లాలు ఉంటే గిట్టుబాటు ధర వచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. కల్లాల ఏర్పాటుతో పాటు బీడీ కార్మికుల మాదిరిగానే పింఛన్, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలి.

జెఈఈ అడ్వాన్స్‌లో గిరిజన విద్యార్థి సత్తా

నవతెలంగాణ-నార్నూర్



జెఈఈ అడ్వాన్స్ ఫలితాలు ఆదివారం వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో తాడిహత్నూర్ గ్రామానికి చెందిన జాదవ్ సంగీత ఆనంద్ రావ్ దంపతుల కొడుకు జాదవ్ మహిపాల్ గిరిజన విద్యార్థి 360 మార్కులకు గాను 105 మార్కులు సాధించి ఇండియా లెవల్‌లో ఎస్టీ కోటాలో 230 ర్యాంక్ సాధించి, తన సత్తాను చాటాడు. మంచి ర్యాంకు సాధించడంతో గ్రామస్తులు పలువురు అభినందించారు. మంచి ప్రతిభను కనబర్చాలని ఆకాంక్షించారు.

రజక సంఘం అభివృద్ధికి ముందుంటాను



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రజక సంఘం అభివృద్ధికి తన వంతుగా ఎల్లవేళలా సహకారం అందించడానికి ముందుంటానని తెలంగాణా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ తెలిపారు. ఇటీవల ఎన్నికైన పట్టణ రజక సంఘం నాయకులు ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంఘం ప్రతినిధులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి వారికి అభినందనలు తెలియజేశారు. స్థానికంగా సంఘం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను నాయకులు వివరించగా, వారికి తన వంతు సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన రజక సంఘం నాయకులను కలవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. సంఘం ఆశీర్వాదంతోనే తాను ఈ స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. సంఘ భవన ఆవరణలోని నాంచారమ్మ దేవస్థానం అభివృద్ధికి తన వంతుగా నెల వేతనం లక్ష రూపాయలను అందిస్తున్నట్టు ప్రకటించారు. భవిష్యత్తులోనూ తన వంతు సహకారం ఎల్లవేళలా అందిస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సంతోష్, వినోద్‌లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండలంలోని సట్వాజీగూడలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జైనూర్ మండలం పాట్నాపూర్ గ్రామానికి చెందిన నాగ్‌నాథ్(32) పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంద్రవెల్లి మండలం సట్వాజి గూడకు చెందిన పార్వతి(28)తో వివాహం జరిగింది. ఇటీవల భార్యభర్తల మధ్య గొడవలు జరిగాయి. ఆమె కొన్ని రోజుల నుంచి పుట్టింటిలో ఉంటుంది. ఆదివారం భర్త వచ్చి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో భర్త పురుగులమందు తాగాడు సమాచారం అందుకున్న 108 పైలట్ ఆత్రం ఆశోక్, ఈఎంటీ ప్రవీణ్ ప్రథమ చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడని తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కిలో వద్దు.. పావుకిలో చాలు..

- కొనేందుకు జంకుతున్న సామాన్యులు



నవతెలంగాణ-ఇచ్చోడ

ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు అనే చందంగా ఉంది. సామాన్యుడి పరిస్థితి. మార్కెట్‌లో కూరగాయల ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో సామాన్యులు కూరగాయలు కొనేందుకు జంకుతున్నారు. కనీసం రూ.5వందల తీసుకెళ్తే 5 కిలోల కూరగాయలు ఇంటికి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న ఉద్యోగులు. సామాన్యుడు పరిస్థితి మరి దారుణంగా మారింది. ఓవైపు పప్పులు కొనలేని పరిస్థితి. కనీసం కూరగాయలు అయినా తినాలనుకుంటే వాటి ధరలు ఆకాశనంటుతున్నాయి. టమాటా కిలో రూ.50 నుంచి దిగనంటుంది. కొత్తిమీర కిలో రూ.150కు చేరింది. కాకరకాయ రూ.100తో కోర కోర చూపులు చూస్తోంది. గోరు చిక్కుడు వంద రూపాయలతో కత్తులు నూరుతున్నది. బీట్రూట్ అబ్బో, క్యారెట్ రేటు.. అంటూ ముందుకు కదలేతే. ఎల్లి, అల్లం కంటతడి పెట్టిస్తున్నది. ఆకుకూరలు ధరలు సైతం కనికరం చూపడం లేదు. ఎండలో కూరగాయల సాగు బడి తగ్గి పంటలు ఉత్పత్తి లేని కారణంగా వినియోగదారుల డిమాండ్‌కు తగ్గట్టు స్టాక్ రాకపోవడంతో ఇచ్చోడ మండల కేంద్రంలో కూరగాయల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ప్రధానమైన అన్ని రకాల కూరగాయల ధరలు కేజీకి 80 నుంచి 100 రూపాయల వరకు పలుకుతుండటం, కనీసం పావు కేజీ కొందామన్న కనీసం రూ.30 వరకు చెల్లించాల్సి వస్తుందని వినియోదారులు వాపోతున్నారు. మండలంతో పాటు సిరికొండ, గుడిహత్నూర్, నేరడిగొండ, బజార్‌హత్నూర్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి రైతులు కూరగాయలను తీసుకొని వచ్చి మార్కెట్‌లో విక్రయిస్తారు. కూరగాయల సాగు తగ్గుముఖం పట్టడంతో ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొనడంతో దళారులు ఇష్టారాజ్యంగా అధిక ధరలకు విక్రయిస్తున్నారని వినియోదారులు వాపోతున్నారు. మరోవైపు కంది, మినప, పెసర, శనగ, పప్పు ధరలు సామాన్యుడి ఆశలపై నీళ్ల చల్లుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని సామాన్యుడికి అందుబాటులో కూరగాయలు నిత్యవసర ధరలు అదుపులో పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ప్రస్తుతం కూరగాయల ధరలు

టమాట- 50	నిమ్మకాయలు-70
వంకాయ -40	అల్లం-150
బెండి-40	ఎల్లి గడ్డలు-160
పువ్వు గోపి -80	ఉల్లి గడ్డలు-25
ఆకు గోపి-30	మునకాయలు-80
క్యారేట్ -80	దోసకాయలు-40
బిట్ రూట్-60	తోట కూర-30 (రెండు కట్టలు)
కొత్తిమీర-150	మెంతి కూర-10 (ఒక కట్ట)
పుదీనా-140	పాల కూర-30 (రెండు కట్టలు)

నేడు ప్రజావాణి ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించడం జరుగుతుంది. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని, తిరిగి యధావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ రాజర్షిషా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 10వ తేదీ సోమవారం నుంచి యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల కమిటీ ఎన్నిక స్థానిక శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముష్కం రామకృష్ణాగౌడ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా సంతన్న, ప్రధాన కార్యదర్శిగా ఎం ఆంజనేయులు, గౌరవాధ్యక్షులుగా సుదర్శన్‌రెడ్డి సలహాదారులుగా ఎం.శ్రీధర్, చిన్నరావు, ఉపాధ్యక్షులుగా మహేందర్ తండసాగర్, కోశాధికారిగా శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ జిల్లా నాయకులు చాకేటి లస్మన్న, తెలంగాణ ఉద్యమ చరిత్ర పుస్తక రచన బాధ్యతలు జాదవ్ పుండ్లిక్ రావు, జనార్ధన్‌రెడ్డి, గంగుల చిన్నన్న, ఉద్యమకారులు ఎం శ్రీధర్, చిన్నరావు, ఆంజనేయులు, నాగరావు, భోజరాం పాల్గొన్నారు.

ఆశ్రమాలు ప్రగతికి నిలయాలు

- నాలుగు పాఠశాలల్లో పదిలో వంద శాతం ఫలితాలు

నవతెలంగాణ-నార్నూర్



గిరిజన బాలబాలికలకు మంచి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఏర్పాటు చేసింది. నార్నూర్ మండల కేంద్రంతో పాటు జామడ, తాడిహత్నూర్, మాన్కాపూర్, భీంపూర్, గాదిగూడ మండల కేంద్రంతో పాటు అర్జుని, ఝరి గ్రామంలో మొత్తం తొమ్మిది ఆశ్రమ పాఠశాల ఉండగా, ఏడు ఆశ్రమ పాఠశాలల్లో వసతి గృహాలతో విద్యను అందిస్తున్నారు. రెండు పాఠశాలల్లో వసతి గృహంగా కొన్న సాగుతున్నాయి. రెండు శాటిలైట్ పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల్లో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యను బోధిస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో గాదిగూడ మండల కేంద్రంతో పాటు అర్జుని, ఝరి, నార్నూర్ మండల కేంద్రంలో బాలికల ఉన్నత పాఠశాలలో వంద శాతం ఫలితాలు వచ్చాయి. గాదిగూడ మండలంలో ఉన్న మూడు పాఠశాలలో వంద శాతం ఫలితాలు సాధించాయి. ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణతో గతేడాది కంటే ఈసారి మెరుగైన ఫలితాలు వచ్చాయి. పాఠశాలలో వసతి గృహంలో విద్యార్థులకు సకల సౌకర్యాలను కల్పించేందుకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ ఏడాది ప్రవేశాలను పెంచే ఉద్యేశంతో గ్రామాల్లో ప్రభుత్వం పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలను, కొనసాగుతున్న విద్యను, పదో తరగతి ఫలితాలను, వివరిస్తూ బడిబాటలో భాగంగా పోషకులకు అవగాహన కల్పిస్తూ ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నారు.

మెరుగైన విద్యను అందించడమే లక్ష్యం

ఏటీడబ్ల్యూఓ కే.క్రాంతికుమార్

గిరిజన ఆదివాసీ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే లక్ష్యంగా ఐటీడీఏ పని చేస్తుందని తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో ఉమ్మడి మండలంలో నాలుగు పాఠశాలల్లో వందశాతం ఫలితాలు వచ్చాయి. వచ్చే ఏడాది కూడా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, ఉమ్మడి మండలంలో ఉన్న అన్ని ఆశ్రమ పాఠశాలల్లో వందశాతం ఫలితాలు సాధించే విధంగా కృషి చేస్తాం.

కేయూ పరిధిలోని పీజీ పరీక్షలు వాయిదా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పీజీ కోర్సుల ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ కోర్సుల నాలుగో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బీఎస్ఎల్ సౌజన్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 11 నుంచి ఈ పరీక్షలు జరగాల్సి ఉండగా.. వివిధ పోటీ పరీక్షలు ఉన్న నేపథ్యంలో అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు సెమిస్టర్ పరీక్షల్ని వాయిదా వేసినట్టు పేర్కొన్నారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించాలనేది త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొన్నారు. కాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పీజీ విద్యార్థులు గమనించాలని పేర్కొన్నారు.

ఆరోగ్యశ్రీలో కొత్త చికిత్సలు చేర్చడం హర్షణీయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించాలనే సదుద్యేశంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో కొత్తగా పలు చికిత్సలను చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్‌లో చేరడంతో పాటు మరిన్ని వైద్య సేవలను కల్పిస్తూ తీసుకున్న నిర్ణయంపై సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలూరి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఏంజియోగ్రామ్, పార్కిన్సన్, వెన్నుముక సర్జరీ సహా 65 చికిత్స విధానాలతో పాటు ఆయుష్మాన్ భారత్ పరిధిలోని 98 చికిత్స విధానాలను ఆరోగ్య జాబితాలో చేర్చడంతో నిరుపేదలకు ఎంతో న్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న చికిత్సల ప్యాకేజీ ధరలను పెంచడం, ఇందుకోసం అదనంగా రూ.497,29 కోట్ల నిధులను విడుదల చేయడం హర్షణీయమని పేర్కొన్నారు.

బీజీ 3 నకిలీ విత్తనాలను కట్టడి చేయాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

బీజీ3 నకిలీ విత్తనాలు అమాయక రైతులు కొనుగోలు చేయకుండా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని రైతు వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రైతులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి బొర్రన్న మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు బీజీ3 పత్తి విత్తనాలను గుజరాత్ నుంచి తీసుకొస్తున్న చిరు వ్యాపారస్తులు సరఫరా చేస్తున్నా దృశ్యాలు కోకొల్లలుగా కనిపిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ బీజీ 3 విత్తనాలను సరఫరా చేస్తున్నా వారిపైన వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి, కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సర్టిఫైడ్ చేసినటువంటి విత్తనాలనే అందించాలని తెలిపారు. రైతులు తీసుకునే విత్తనాల రకాలు రాశి 659, మనిమేకర్, ప్లాటినం, చంద్ర గోల్డ్, రాశి 797, సోయాబిన్‌లో ఉన్న రకాలు కూడా గ్రీన్ గోల్డ్, ఈగల్ వివిధ రకాలైన విత్తనాలను రైతులకి భరోసా ఉండే విదంగా, నాణ్యమైన విత్తనాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అయన తెలిపారు. ఈ సమావేశంలో రైతులు రమేష్, కర్తర్ సింగ్, హన్మంత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎక్స్ ఆర్మీ సర్వీస్‌మెన్ అసోసియేషన్ సమావేశం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



పట్టణంలోని శిశుమందిర్ హైస్కూల్‌లో ఆదివారం ఎక్స్ ఆర్మీ సర్వీస్‌మెన్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు శివ కుమార్ నాయర్ మాట్లాడుతూ ఇటీవల రిటైర్డ్ అయిన ముగ్గురు జవాన్లు అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకోవడం జరిగిందన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు తమ అసోసియేషన్‌కు జులై మాసంలోగా స్థలం కెటాయిస్తామని హామీ ఇచ్చారని, స్వాతంత్ర్య దినోత్సవం రోజు తమ స్థలంలోనే జాతీయ జెండాను ఎగురవేస్తామని అన్నారు. అలాగే త్వరలో కుమురం భీం జిల్లాలో ఎన్‌సీసీ కోచింగ్ సెంటర్ ప్రారంభం అవుతుందన్నారు. కలెక్టరేట్‌లో ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు ప్రత్యేక ఆఫీస్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు.

జేఈఈ ఫలితాల్లో మెరిసిన అనార్‌పల్లి విద్యార్థి

నవతెలంగాణ-కెరమెరి



జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఫలితాల్లో అనార్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రాథోడ్ శేషారావు, సవిత దంపతుల కుమారుడు రాథోడ్ అంశుల్ రాం సత్తాచాటాడు. ఆదివారం విడుదల చేసిన ఫలితాల్లో ఆల్ ఇండియా ఎస్టీ విభాగంలో 63వ ర్యాంకు సాధించాడు. అంశుల్ రాం విద్యాభ్యాసం 1 తరగతి నుంచి 5 తరగతి వరకు ఉట్నూర్ లోని సన్‌షైన్ పాఠశాల, 6 వ నుంచి 12 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక్ పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేశాడు. జేఈఈ ఫలితాల్లో ప్రతిభ కనబర్చడంతో గ్రామస్తులు అభినందించగా మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెస్ మెదడుకు మేత లాంటిది

- చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిరాజ్



నవతెలంగాణ-రెబ్బెన

చెస్ మెదడుకు మేత లాంటిదని చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిరాజ్ ఉర్ రెహమాన్ అన్నారు. టీబీజీకేఎస్ కార్యాలయంలో చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-9,11,13,15 ఓపెన్ టూ అల్ పోటీలలో గెలిచినా వారికి బహుమతులు అందించారు. దీనికి ఆయన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ ఈగ కనకయ్య, జిల్లా అధ్యక్షుడు ఎస్. సంపత్ కుమార్‌తో కలిసి గెలుపొందిన వారికి బహుమతులు ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు సిరాజ్ ఉర్ రెహమాన్ మాట్లాడుతూ పిల్లలు చెస్ సద్వినియోగం చేసుకోవాలని, చెస్ మెదడుకు మేతలంటిదని తెలిపారు. కార్యక్రమంలో యోగ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేసరి ఆంజనేయులు గౌడ్, చెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బోగే ఉపేందర్, ప్రధాన కార్యదర్శి కల్పన, జాయింట్ సెక్రటరీ ఎం. రవీందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సమ్మయ్య, ఎం. తిరుపతి, శృతిక, కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గెలుపొందిన వారు వీరే...

చెస్ పోటీల్లో అండర్-9 విభాగంలో ఎ.దేవాన్స్, ఎం.శ్రీతన్, పీ. సహర్ప, కే.తన్విక, అండర్-11లో బి.భార్గవ్, కార్తికేయ చారి, పి.మేఘన, ఎం.క్రిషిక, అండర్-13 విభాగంలో డి.జాన్సన్, ఈ.కౌశిక్, ఎస్.వల్లభ్, అండర్-15లో ఎన్. సాయి వర్షిత్, టి.రుద్ర ధృవన్, ఎం.ప్రహర్ష వర్ధన్, ఓపెన్ టూ అల్‌లో ఈ.యశ్వంత్, పీ.శివ కృష్ణ, ఎస్.నవనీత్, ఎస్ సత్యలున్నట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు.

అంబేద్కర్ జీవితం ఆదర్శనీయం

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆదివారం మండలంలోని బూరుగుడ గ్రామంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన అంబేద్కర్ విగ్రహాన్ని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలకు అంబేద్కర్ కావాల్సిన వాడేనన్నారు. సమసమాజ నిర్మాణం కోసం కలలు కన్న గొప్ప వ్యక్తి అని కొనియాడారు. నేటి తరానికి ఆయన ఆదర్శప్రాయుడని కితాబునిచ్చారు. దేశానికి దశదిశ చూపుతున్న రాజ్యాంగాన్ని రచించడమే కాకుండా, ప్రపంచ దేశాలలో దేశానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్, ఆసిఫాబాద్ సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధితులకు బాసటగా నిలిచిన తేలికుల సంఘం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని బాబాపూర్ గ్రామంలో తమ కులస్తునికి చెందిన ఇండ్లు దగ్ధమై పెద్ద ఎత్తున నష్టం జరిగింది. విషయం తెలియడంతో తేలి కుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సందీప్ ఆధ్వర్యంలో విరాళాలను సేకరించారు. ఆదివారం సేకరించిన విరాళాలను ఆదివారం బాదిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ బాధితులకు సాయం చేసే ఉద్దేశంతో తమ కులానికి చెందిన ప్రతి ఒక్కరు స్పందించారన్నారు. కులస్తుల వద్ద నుండి సేకరించిన రూ.15,768 నగదుతో పాటు 50కిలోల బియ్యం, 5లీటర్ల వంట నూనె ఇతర వంట సామాగ్రి ఇచ్చి బాధితులను పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం యువజన అధ్యక్షులు హిద్రే సందీప్, సెండే మురళీ కృష్ణ, కవాల్కార్ ఆనంద్ రావు, కవాల్కార్ ఉద్ధవ్, తపసే పోచన్న, మేంగ్రే మారుతి, కవల్కార్ రవీందర్, కవాల్కార్ ఆకాశ్, బీజ్జు పాల్గొన్నారు.

ఘనంగా బీర్సా ముండా వర్ధంతి

నవతెలంగాణ-కెరమెరి



భారతదేశ స్వాతంత్ర్య సమర యోధుడు, ఆదివాసీ ఉద్యమ వీరుడు క్రాంతిసూర్యవీర్ భగవాన్ బీర్సా ముండా 124 వ వర్ధంతిని ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీర్సా ముండా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ బీర్సా ముండా సేవలను కొనియాడారు. గిరిజనులు ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోని హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు కుద్మేత సోము, సెడ్మకి తుకారాం, షేకు, ఆత్రం విశ్వేశ్వర్, కోట్నక బాపురావు, భీంరావు పాల్గొన్నారు.

బాబాపూర్‌లో అగ్నిప్రమాదం

- రూ.12 లక్షల ఆస్తి నష్టం
- పరామర్శించిన ప్రముఖులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన ఇల్లు

మండలంలోని బాబాపూర్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో కవాల్కర్ లక్ష్మి కుమారుడు సాయికుమార్ దంపతులు నివాసం ఉంటున్న ఇల్లుతో పాటు పక్కనే ఉన్న కవల్కార్ సురేష్‌కు చెందిన కొట్టం అగ్నికి ఆహుతి అయింది. అయితే సాయికుమార్ దంపతులు సంఘటన జరిగిన సమయంలో ఇంట్లో లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అగ్ని ప్రమాదం గురించి అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయడంతో వెంటనే అక్కడికి చేరుకొని మంటలు ఆర్పేసిన రెండు సిలిండర్లు పేలడంతో పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం జరిగింది.

ఇద్దరు బాధితులకు రూ.12 లక్షల నష్టం

రెండు ఇండ్లు పూర్తిగా అగ్నికి ఆహుతి కావడంతో ఇద్దరు బాధితులకు కలిపి రూ.12 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు ఆర్‌ఐ రహమత్ అలీ తెలిపారు. వీరిలో కవర్కర్ లక్ష్మికి సంబంధించిన ఇంటిలో రూ.4,20,000 విలువచేసే ఆరు తులాల బంగారం, రూ.25000 విలువ చేసే 5 క్వింటల్ బియ్యం, రూ.4,00,000 నగదుతో పాటు రూ.80000 విలువ చేసే నిత్యావసర వస్తువులు మొత్తం కలిపి రూ.10 లక్షలు విలువచేసే సామాగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. కవాల్కర్ సురేష్‌కు చెందిన కొట్టంలో రూ.20000 విలువ చేసే 70 బస్తాల యూరియా, రూ. 42,000 విలువ చేసే 30 బస్తాల డీఏపీతో పాటు రూ.60000 విలువ చేసే పశు గ్రాసం ఇతర సామాగ్రితో కలిసి రూ.రెండు లక్షలు నష్టం జరిగినట్లు తెలిపారు.



బాధితులకు సరకులను అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాధితులని పరామర్శించిన ప్రముఖులు

బాబాపూర్‌లో జరిగిన సంఘటనకు సంబంధించిన బాధితులను స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్, జడ్పీటీసీ నాగేశ్వరరావులు వేరువేరుగా పరామర్శించారు. బాధితులను ఓదార్చడంతో పాటు వారివారి పార్టీల ప్రభుత్వాల తరపున ఆదుకునేలా ప్రయత్నాలు చేస్తామని హామీ ఇచ్చారు. తక్షణ సహాయం కింద నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాలేష్ గౌడ్, చరణ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, మాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, కాంగ్రెస్ నాయకులు లోకేష్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షా

- సెంటర్లను తనిఖీ చేసిన కలెక్టర్, అదనపు కలెక్టర్
- నిమిషాం అలస్యం నిబంధన
- కేంద్రాలకు చేరుకునేందుకు హైరానా పడ్డ అభ్యర్థులు
- జిల్లాలో 81.13 శాతం హాజరు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రంలో ఆరు సెంటర్లు, కాగజ్‌నగర్‌లో ఏడు సెంటర్లు ఏర్పాటు చేశారు. దీనిలో మొత్తం 2783 మందిని అధికారులు కేటాయించారు. నిమిషం నిబంధనతో కేంద్రాలకు చేరుకునేందుకు అభ్యర్థులు హైరానా పడ్డారు. ఉరుకులు పరుగులు పెడుతూ సెంటర్ల వద్ద చేరుకున్నారు. అభ్యర్థులకు బయోమెట్రిక్ విదానం హాజరు తీసుకోని క్షుణ్ణంగా పరిశీలించినంతరం లోనికి అనుమతించారు. ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, పీటీజీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అటు అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు జిల్లా కేంద్రంలోని చైతన్య డిగ్రీ కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సెంటర్ల వద్ద బందోబస్తు పరిశీలించారు. సౌకర్యాల గురించి అడిగి తెలుసుకుంటూ సిబ్బంది, అభ్యర్థులకు పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా పరీక్షల వివరాలను వెల్లడిస్తూ జిల్లాలో 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని దీనిలో 2783 మంది పరీక్ష రాయనుండగా, 2258 మంది పరీక్ష రాశారని, మొత్తం 81.13 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. నియమ, నిబంధనల మేరకు అధికారుల సమన్వయంతో పకడ్బందీగా పరీక్ష నిర్వహించడం జరిగిందని తెలిపారు.



పరీక్ష కేంద్రం వద్ద అధికారులు సూచనలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

నేటి నుండి ప్రజావాణి ప్రారంభం

- 84 రోజుల తర్వాత ప్రారంభం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లావ్యాప్తంగా పరిష్కారం కాని సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నారు. ప్రజల నుండి మండల కేంద్రాల్లో తహసీల్దార్లు, జిల్లా కేంద్రంలో కలెక్టర్ ప్రజావాణి ద్వారా అర్జీలను స్వీకరించి సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం సర్వసాధారణం. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ గత మార్చి 16న ఎన్నికల కోడ్ అమలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో మార్చి 17 నుండి ప్రజావాణి రద్దు చేశారు. తిరిగి నేటి నుంచి ప్రజావాణి ప్రారంభం కానుంది.

జిల్లాలో ప్రారంభం కానున్న ప్రజావాణి

ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రజల వద్ద నుండి నేరుగా వినతులు స్వీకరించి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే నేతృత్వంలో నేటి నుండి ప్రజావాణి ప్రారంభం కానుంది.

కలెక్టర్‌గా మొదటి ప్రజావాణి

ఆసిఫాబాద్ కలెక్టర్‌గా వెంకటేష్ ధోత్రే మార్చి 4న బాధ్యతలు స్వీకరించినప్పటికీ అదే నెలలో మార్చి 11న నిర్వహించిన ప్రజావాణి అదనపు కలెక్టర్ దీపక్ తివారి నిర్వహించారు. తర్వాతి తేదీ 17న ఎన్నికల కోడ్ రావడంతో ప్రజావాణి రద్దయింది. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి ప్రజావాణి కావడంతో మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజలు కూడా వారి సమస్యలను చెప్పుకోడానికి పెద్ద ఎత్తున రానున్నారు.

84 రోజుల తర్వాత ప్రారంభం

ఎన్నికల కోడ్ కారణంగా రద్దైన ప్రజావాణి మళ్లీ తిరిగి నేడు ప్రారంభం కానుంది. ఇప్పటికే లోకసభ ఎన్నికలు భారతదేశ చరిత్రలోనే అత్యధిక సమయం తీసుకున్న ఎన్నికలుగా చరిత్ర సృష్టించగా, 84 రోజుల తర్వాత ఎన్నికల కోడు రద్దయి ప్రజావాణి ప్రారంభం కానుంది. జిల్లాలోని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇప్పటికే అధికారులు ప్రకటించారు.

ఆర్టీసీ డ్రైవర్ మృతి.. పరామర్శించిన నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహించి ఆరోగ్య రీత్య శ్రామిక్‌కు మారిన జంజీరాల రాజు(50) రోజు మాదిరిగా ఆదివారం ఉదయం విధులు నిర్వహించేందుకు వస్తుండగా అకస్మాత్తుగా పక్షవాతం వచ్చి సందీప్ నగర్‌లోని ఆయన ఇంటిదగ్గర నాలిలో పడి మరణించాడు. మృతుడికి భార్య రేవతి, ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. ఆర్టీసీ కార్మికుడు మరణించాడని తెలియగానే కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్ ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజు వ్యక్తిగతంగా ఎంతో మంచి వాడన్నారు. కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు లోకేష్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, రైతు సంఘం అధ్యక్షుడు మారుతి పటేల్, మాలీ సంఘం అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

నీట్ అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ జాఫర్



నవతెలంగాణ-కెరమెరి

నీట్ అవతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ జాఫర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 04న ఎలాంటి హడావుడి లేకుండా దేశంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో నీట్ పరీక్ష ఫలితాలు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ప్రకటించిందన్నారు. ముందుగా జూన్ 14న అని ప్రకటించి, ఎలాంటి సమాచారం లేకుండా ఫలితాలు వెల్లడించడంపై దేశ వ్యాప్తంగా అనేక ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఎంబీబీఎస్, బీడీఎస్ గ్రాడ్యుయేట్ స్థాయి ప్రవేశ పరీక్షలో మొత్తం మార్కులు 720 ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు ఇవ్వబడతాయని, ప్రతి తప్పు సమాధానానికి మొత్తం నుండి 1 మార్కు తీసివేయబడుతుందని, సమాధానం లేని ప్రశ్నలు గుర్తించబడవన్నారు. అలాంటప్పుడు గణితశాస్త్రంలో 719, 718 వంటి మార్కులు పొందడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కానీ ఈ నీట్ ఫలితాల్లో అలాంటి సందర్భాలు కనిపించాయని ఆరోపించారు. ఈ ఏడాది ఫలితాలు గ్రేస్ మార్కింగ్ కోసం అని ఎన్‌టీఏ క్యాజువల్‌గా ఒక ప్రకటనలో తెలిపిందన్నారు. కానీ ఈ ఏడాది పరీక్షకు ముందు ఎన్‌టీఏ ప్రచురించిన మార్గదర్శకాలలో ఎక్కడా ఈ గ్రేస్ మార్కింగ్ పథకం గురించి ప్రస్తావించలేదన్నారు. అంతే కాకుండా ఒకే సెంటర్ నుండి వరుసగా రోల్ నంబర్లు ఉన్న విద్యార్థులు ఒకే మార్కులను పొందారని ఫిర్యాదులున్నాయని తెలిపారు. తిరిగి పరీక్షను నిర్వహించి ఎన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, తిరుపతి, సుధాకర్ పాల్గొన్నారు.

విప్లవాత్మక మార్పులు తెచ్చిన రామోజీరావు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మీడియా రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత రామోజీరావుకే దక్కుతుందని కాగజ్‌నగర్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి. సురేందర్ రావు(నవతెలంగాణ), వి. తిరుమలచారి (ఆంధ్రజ్యోతి) అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో రామోజీరావు మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. దీనికి ముందు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిఖార్సయిన జర్నలిజానికి నిలువెత్తు నిదర్శనం రామోజీరావని అన్నారు. జర్నలిజం కళాశాల ద్వారా దేశానికి ఎంతోమంది ప్రతిభావంతులైన జర్నలిస్టులను రామోజీరావు అందించారని కొనియాడారు. ఆయన మృతి మీడియా రంగానికి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో కోశాధికారి షెఫీఉల్లా (ప్రజాపక్షం), సభ్యులు జంబుల మధూకర్ (ఈనాడు), గంధం శ్రీనివాస్ (ఆంధ్రజ్యోతి), అంగల తిరుపతి (ఆదాబ్ హైదరాబాద్), పుల్లూరి సతీష్, బోగె అనిల్ (ఆంధ్రప్రభ), ఈర్ల సతీష్ కుమార్ (విశాలాంధ్ర), జుమ్మి రాజు (ప్రజాపక్షం), మహేష్ (వెలుగు), ఇసాక్ (నమస్తేతెలంగాణ), వార్ల మహేష్ (సాక్షి), సీనియర్ పాత్రికేయుడు వి. శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు రాజశేఖర్, నాగేందర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

- ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు తుకారం
- ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధ్యాయ సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, వాటి పరిష్కారం కోసం స్టేట్ టీచర్స్ యూనియన్ అలుపెరగని పోరాటం చేస్తుందని ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు చునార్కర్ తుకారం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో సంఘం ఆవిర్భావ వేడుకలు జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క మాణిక్ రావుతో కలిసి ఘనంగా నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరించినంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులను నిర్బంధంగా ఉంచే పద్ధతి నిరసిస్తూ 1947 జూన్ 9న ముగ్దుం మొయినుద్దీన్ సారథ్యంలో ఎస్టీయూ ఆవిర్భావం జరిగిందని గుర్తు చేశారు. అప్పటినుండి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లోని పీఆర్సీతో పాటు డీఏలు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం చేపట్టదలచిన బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కేజీబీవీ ఎస్ఎస్ఏలో పని చేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు సులేమాన్, లక్ష్మణ్, బాదీరావు, భాస్కర్ పాల్గొన్నారు.

ఎంపీ హోదాలో ఢిల్లీ పెద్దలను కలిసిన వంశీకృష్ణ



నవతెలంగాణ-జైపూర్

పెద్దపల్లి పార్లమెంట్ సభ్యునిగా గెలుపొందిన గడ్డం వంశీకృష్ణ తన తండ్రి చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి కాంగ్రెస్ పార్టీ పెద్దలను కలిశారు. పెద్దపల్లి ఎంపీగా గెలిచి మొదటిసారి ఢిల్లీ వెళ్లిన ఆయన ఆదివారం ఏఐసీసీ అధ్యక్షులు మల్లి ఖార్జున ఖర్గేతో పాటు ఏఐసీసీ కార్యదర్శి వేణుగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన తండ్రి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి మల్లిఖార్జున ఖర్గేతో పాటు కేసు వేణుగోపాల్‌లను శాలువాలతో సన్మానించారు.

ఐద్వా జిల్లా అధ్యక్షురాలుగా పోతు విజయ



నవతెలంగాణ-జన్నారం

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) మంచిర్యాల జిల్లా అధ్యక్షులుగా జన్నారం పట్టణానికి చెందిన పోతు విజయ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా దాసరి రాజేశ్వరి ప్రధాన కార్యదర్శిగా సంకె రజిత, ఉపాధ్యక్షులుగా నాగజ్యోతి సమ్మక్క భవాని, సహాయక కార్యదర్శులుగా నిర్మల ఉమారాణి, జిల్లా కమిటీ సభ్యులుగా రాజేశ్వరి, రేణుక, సరిత, రమాదేవి, సమ్మక్క ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల కోసం ఐ ద్వా సంఘం పనిచేస్తుందన్నారు.

పేదల దవాఖానపై చిన్న చూపు

- అనేక సమస్యలతో వైద్య సేవలు
- శిథిల వస్తకు చేరిన ఆస్పత్రి భవనం
- కంపు కొడుతున్న మార్చురీ



మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

నవతెలంగాణ-మంచిర్యాల

వేలాది మంది పేద ప్రజలకు నిత్యం వైద్యం అందించే మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నిర్లక్ష్యానికి గురవుతోంది. అధికారులు, ప్రజా ప్రతి నిధుల నిర్లక్ష్యానికి పేద ప్రజలకు వైద్యం అందకుండా పోతోంది. ఏళ్ళు గడిచే కొద్ది భవనం శిథిలావస్తకు చేరుతోంది. గడ్డం గంగారెడ్డి జ్ఞాపకార్థం గడ్డం నరసింహారెడ్డి నిర్మించిన అప్పటి ఆస్పత్రి భవనాన్ని కాసు బ్రహ్మానందరెడ్డి, అప్పటి సీఎం 1969లో ప్రారంభించరు. 55 ఏండ్లు గడిచినా నిత్యం వందల సంఖ్యంలో పేదలకు వైద్య సేవలు అందిస్తోంది.

పెచ్చులూడుతున్న పైకపు

భవనం శిథిలావస్తకు చేరడంతో పై కప్పు పెచ్చులూడి పడుతున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే పైకప్పు నుంచి నీళ్ల కారడంతో రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత 3 సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు హాస్పిటల్ బిల్డింగ్ అంత నీటితో నిండి పోయి గోడలు తడిసి పోయి ఎక్కడ ముట్టుకున్న విద్యుత్ షాక్ రావడం, హాస్పిటల్‌లోని విద్యుత్ బోర్డులు, హాస్పిటల్ పరికరాలు అన్ని పాడై పోయాయి. భవనాన్ని సందర్శించిన ఆర్ అండ్ బీ అధికారులు భవనం పూర్తి స్థాయిలో శిథిల వస్తకు చేరిందని, పెద్ద, మొత్తంలో ఏదైనా సంభవించినపుడు తట్టుకునే శక్తి బిల్డింగ్ కు లేదని తేల్చి చెప్పారు.

కంపు కొడుతున్న మార్చురీ

జిల్లా ప్రధాన హాస్పిటల్ కాబట్టి ఇటు జిల్లాతో పాటు పక్క జిల్లాల నుండి కూడా ఎమర్జెన్సీ కేసులు వస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో గుర్తు తెలియని మతదేహాలను సైతం ఇక్కడికి తీసుకొచ్చి వివరాలు తెలిసే అంత వరకు భద్ర పరిచిన సందర్భాలు ఉన్నాయి. కానీ శవాలను భద్ర పరిచేందుకు సరి పడ గదులు, శవాలు వాసన రాకుండా ఉంచేందుకు ఉపయోగించే ఫ్రీజర్ బాక్స్ లు అందుబాటులో లేక పోవడంతో రోజుల తరబడి ఉంచిన డెడ్ బాడీలు కుళ్ళి పోయి కంపు కొడుతున్నాయి. 320 పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో నిబంధనల ప్రకారం లెక్క ప్రకారం 3 శవాలను పెట్టె ఫ్రీజర్ బాక్స్‌లు అవసరం ఉన్నపటికీ, ఒక్కటే అందుబాటులో ఉంది. ఆ ఒక్కటి కూడ రిపేర్ కు రావడంతో చాల సార్లు రిపేర్లు చేయించామని అయినప్పటికీ పని ఉపయోగపడటంలేదని సిబ్బంది తెలిపారు. ఫ్రీజర్‌లు లేకపోవడం రోజుల తరబడి ఉన్న డెడ్ బాడీల నుండి వచ్చే దుర్వాసనకు సిబ్బంది మార్చురీ వైపు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఇంకా ఆ కంపు వాసనలో శవ పరీక్షలు నిర్వహించే వైద్యుల గోస వర్ణనాతీరం, ఇటు వైద్యులు, గుర్తు పట్టలేని అటువంటి శవాలను ఉంచేందుకు ఫ్రీజర్‌లు ఏర్పాటు చేయాలనీ పోలీసులు పలు సార్లు ధరకాస్తులు చేసుకున్నప్పటికీ ఫలితం లేక పోయింది. మార్చురీ పక్కన ఉన్న రెడ్ క్రాస్, మార్చురీ వెనుక భాగంలో నివాసం ఉండే వారు కూడా మార్చురీ నుండి వచ్చే వాసనకు తట్టుకోలేక చాల సార్లు హాస్పిటల్ సిబ్బందిని కలిసి విషయాన్నీ వివరించిన సందర్భాలు ఉన్నాయి.

వేదిస్తున్న సిబ్బంది కొరత

ఆస్పత్రిలో మొత్తం 7 విభాగలకు సంబంధించిన వేరు వేరు గదులు ఉన్నాయి. ఒక్కో గదిలో ఒక్కో విభాగం చొప్పున ఆర్థో, పిల్లల వర్డ్, సర్జరీ వార్డ్, క్రిటికల్ కేర్, ఐసీయూ, ఓపీ, ఆపరేషన్ థియేటర్‌లు ఉన్నాయి. ఒక్కో విభాగంలో పని చేసేందుకు ఇద్దరు చొప్పున వార్డ్ బాయ్స్ ఉండాలి కానీ మొత్తంలో ఇద్దరే వార్డ్ బాయ్స్ ఉన్నారు. పేషెంట్ కేర్ టేకర్, సెక్యూరిటీలను మారుస్తూ అన్ని వార్డ్ లలో పని చేయించుకుంటున్నారు. అధికారులు దానితో ఆర్థో, సర్జరీ వార్డ్‌లో చికిత్స పొందుతున్న రోగులకు డ్రస్సింగ్‌తో పాటు గాయాలకు ప్రథమ చికిత్స అందించేందుకు సిబ్బంది కరువయ్యారు. మరో వైపు ఎలెక్ట్రిషన్‌లు హాస్పిటల్ మొత్తంలో ఒక్కరే ఉండడంతో సెక్యూరిటీ నే కరెంట్, జనరేటర్‌లకు సంబంధించిన పనులు చేయిస్తున్నారు. అవగాహన లేకుండా సెక్యూరిటీ సిబ్బంది చేస్తున్న విద్యుత్, ఎలెక్ట్రికల్ పనులతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

ప్రధాన సమస్య పార్కింగ్

ఆస్పత్రికి వచ్చే రోగులకు, సిబ్బంది వాహనాలు పార్కింగ్ చేసేందుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. స్థలం లేకపోవడంలో వాహనాలను ఇష్టాను సారంగా ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. హాస్పిటల్ ఆవరణలో వాహనాలు నిలిపేందుకు స్థలం లేక పోవడంతో కొందరు వైదులు తమ వాహనాలను రోడ్లపై విధులకు హాజరవుతున్నారు. హాస్పిటల్‌తో సంబంధం లేని వ్యక్తులు కూడా హాస్పిటల్‌లోకి వచ్చి తమ వాహనాలను పార్కింగ్ చేసుకొని వెళ్తున్న సంఘటనలు ఉన్నాయి. దీనితో హాస్పిటల్ కు వచ్చే వారి వాహన పార్కింగ్ కు స్థలం సరి పోవడం లేదు. ఎమర్జెన్సీ, రోగులను తరలించే ప్రభుత్వ అంబులెన్సులు హాస్పిటల్ ఆవరణలోకి రావడానికి దారి లేకుండా పోతుంది.

ఉన్నదాంట్లోనే సద్దుకుంటున్నాం

హరీష్ చంద్ర రెడ్డి, ఆస్పత్రి సువరింటెండెంట్.



మార్చురీలో రోజుల తరబడి శవాలను ఉంచేందుకు సరిపడా స్థలం, ఫ్రీజర్ బాక్స్‌లు లేవు. అవసరం ఉన్నాయని అధికారులకు ఎనో సార్లు లెటర్‌లు పెట్టాం. అయినప్పటికీ ఎవరు స్పందించడం లేదు. భవనం కూడా శిథిల వస్తకు చేరి పైకప్పు పెచ్చులు ఊడి పడుతుంది. సిబ్బంది కొరత, సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతూ వైద్య సేవలు అందిస్తున్నాం. చాల సార్లు నాయకులకు, అధికారులకు విషయాన్ని వెల్లడించాం. ఎవరు స్పందిచకపోవడంతో ఉన్నదాంట్లో సద్దుకుంటున్నాం.



కంపుకొడుతున్న మార్చురీ గదులు



పెచ్చులూడిన ఆస్పత్రి పైకప్పు



విచ్చలవిడిగా రోడ్డుపై వాహనాల పార్కింగ్

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష అధికారుల సమన్వయంతో ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రతిభ కళాశాల, మిమ్స్ ప్లే స్కూల్, ఆర్‌బీహెచ్‌వీ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్షకు జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 9 వేల 384 మంది పరీక్షకు హాజరు కావలసి ఉండగా 7 వేల 443 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. నియమ, నిబంధనల మేరకు అధికారుల సమన్వయంతో పకడ్బందీగా పరీక్ష నిర్వహించడం జరిగిందని తెలిపారు. పరీక్షా కేంద్రంలో ఉదయం 9.30 గంటల నుండి బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకోవడం జరిగిందని, నిబంధనల మేరకు బూట్లు, మొబైల్ ఫోన్లు, ఎలాంటి ఎల్రక్టానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించలేదని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచడం జరిగిందని తెలిపారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ప్రత్యేక బస్సులు, నిరంతర విద్యుత్ సరఫరా, వేసవి ఉష్ణోగ్రత దృష్టా ఓఆర్‌ఎస్. ప్యాకెట్లు, మందులు, ప్రథమ చికిత్స కిట్లు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించామని వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేటి నుండి యధావిధిగా ప్రజావాణి

నవతెలంగాణ-నస్పూర్

లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా నిలిపివేయబడిన ప్రజావాణి కార్యక్రమం నేటి నుంచి కలెక్టరేట్‌లో యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ బదావత్ సంతోష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులలో నిమగ్నమై ఉండటం వలన ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా నిలిపివేశామని, జూన్ 10వ తేదీ నుండి ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని, ఈ విషయాన్ని గమనించి వివిధ సమస్యల పరిష్కారానికి అర్జీదారులు తమ దరఖాస్తులను అందజేయవచ్చని తెలిపారు.

రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో చేయూత



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దుబ్బగూడెం గ్రామానికి చెందిన ఓరం కార్తీక్ గత కొన్నేళ్ల కింద ప్రమాదంలో గాయపడ్డాడు. అప్పటి నుంచి నడవలేని పరిస్థితిలో ఉండగా, రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్‌కు తెలపడంతో వెంటనే స్పందించి నూతన వీల్ చైర్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంచిర్యాల నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వేముల కృష్ణ, ఆ ట్రస్టు సభ్యుడు సత్తార్ చేతులమీదుగా బాధితుడికి అందింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక్ కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కనుకుల రాకేష్, కాసిపేట గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నాలి మధు పాల్గొన్నారు.

సేఫ్టీ కమిటీలలో ప్రాతినిధ్యం కల్పించాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి వ్యాప్తంగా ప్రమాదాల నివారణకు సేఫ్టీ కమిటీలలో ప్రాతినిధ్యం కల్పించాలని డైరెక్టర్(పా) ఎన్‌వీకే శ్రీనివాస్‌ను యాదగిరి సత్తయ్య కోరినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల వైఫల్యం, అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, బొగ్గు గనులలో జాతీయ సంఘాలకు రక్షణ కమిటీలలో అవకాశం కల్పించాలని నిబంధనలు ఉన్నాయని, అమలుపరచుటకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న బొగ్గు సరఫరా డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకత సాధించాలని నిబంధనలు ఉన్నప్పటికీ ఆచరణలో పాటించకుండా యాజమాన్యం మొండిగా, నిర్లక్ష్యంగా వ్యవహరించడం జరుగుతుందని పేర్కొన్నారు. రక్షణ కమిటీలలో జాతీయ సంఘాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ జాతీయ అంతర్జాతీయ నియమ నిబంధనలు కొనసాగించాలని పేర్కొన్నారు.

జులై 7న కేవీపీఎస్ జిల్లా సదస్సు



నవతెలంగాణ నస్పూర్

కుల వివక్షపై జులై 7న నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి దూర్కె మోహన్ పిలుపునిచ్చారు. ఆదివారం చార్వక ట్రస్ట్ హాల్‌లో జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాజేశ్వాం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కేవీపీఎస్ 25 సంవత్సరాల సుదీర్ఘ పోరాట ఫలితంగా హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతిపై పోరాటం చేసి ఆ పద్ధతి లేకుండా చేశామన్నారు. కులదురహంకార హత్యలపై బాధితుల పక్షాన పోరాటం చేశారని, బాధితులకు ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దళితులకు ఉచిత కరెంట్ ఇవ్వాలని పోరాడి 101 ఉచిత యూనిట్లు సాధించుకున్నామని, మంచిర్యాల జిల్లాలో కోటపల్లి మండలంలో దళితుడి ఎడ్లు పెరట్లో మేషయని కర్రకి కట్టేసి కొట్టిన పరిస్థితి ఉందని, బాధితుని పక్షాన పోరాటం చేసి అగ్రకుల నిందితుడి పైన కేసు నమోదు చేయించడం జరిగిందన్నారు. ఇదే కోటపల్లి బోరంపల్లి గ్రామంలో మహనీయులు మహాత్మ జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాల మీద దాడి చేయడం జరిగిందని, దుండగులను శిక్షించాలని పోరాటం చేసి కేసు నమోదు చేయించడం జరిగిందన్నారు. జిల్లాలో దళితుల మీద, గిరిజనుల మీద రోజురోజుకు కుల వివక్ష అంటరానితనం కొనసాగుతుందని, ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాటాలు చేసి హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో మరిన్ని ఉద్యమాలు నిర్వహించడం కోసం గ్రామ, మండల కమిటీలు ఏర్పాటు చేసుకోవటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాజేశ్వాం, దుర్గం నాన్నయ్య, దమ్మాల రాములు, జిమ్మిడి కుమార్, రాజు పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో బెల్లంపల్లి సీఓఈ విజయాలు

నవతెలంగాణ-తాండూర్



ఎన్టీఏ వెల్లడించిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో బెల్లంపల్లి(సిఓఈ) జాతీయ స్థాయి ఉత్తమ ర్యాంకులు సాధించింది. శాల నుండి హాజరైన 9 మంది విద్యార్థుల్లో నలుగురు క్వాలిఫై కావడమేకాకుండా జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. వీరిలో ఆడె నవనీత్ 1171 ర్యాంక్‌తో కళాశాల టాపర్‌గా నిలిచాడు. అదేవిధంగా దుర్గం చరణ్ తేజ్(2778), వెలుతురు అఖిల్(3679), రాంటెంకి శివ(7476)లు జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ కె రాజ్ కుమార్, అధ్యాపకులు నాగిని శ్రీరామవర్మ, పిన్నింటి కిరణ్, చందా లక్ష్మీనారాయణ, మిట్ట రమేష్, కట్ల రవీందర్, ముద్దసాని శోభ, అవునూరి రవి, అల్లూరి వామన్ అభినందించారు.



రామోజీరావు మతి పట్ల నివాళి

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని కాసిపేట ప్రెస్ క్లబ్‌లో ఈనాడు అధినేత రామోజీరావు మృతికి సంతాపంగా ఆదివారం విలేకరులు నివాళ్ల అర్పించారు. ఈ సంధర్భంగా రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నజీర్ హుస్సేన్ మాట్లాడుతూ తెలుగు పత్రిక రంగంలో నూతన ఒరవడి సృష్టించిన రామోజీరావు మరణం పత్రికా రంగానికి తీరని లోటని, ఆయన తుది శ్వాస వరకు నిజాన్ని నిర్భయంగా ప్రపంచానికి చాటిచెప్పిన అక్షర యోధుడన్నారు. ప్రజలకు, ప్రభుత్వాలకు వారధిగా తెలుగు రాష్ట్రాల అభివృద్ధే ధ్యేయంగా ఆయన అందించిన సేవలు చాలా గొప్పవని, అక్షర యోధుడిగా జర్నలిజానికే వన్నెతెచ్చిన మేధావి రామోజీరావు అని కొనియాడారు. పలు వ్యాపార సంస్థలను స్థాపించి లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత ఆయనకి దక్కిందన్నారు. ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువేనని, ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు రవి రాజ్, మోతీరాం పాల్గొన్నారు.

విచ్చలవిడిగా ఇసుక అక్రమ నిల్వలు

- ప్రేక్షక పాత్ర పోషిస్తున్న సంబంధిత అధికారులు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పలు గ్రామాల్లో విచ్చలవిడిగా అక్రమ ఇసుక నిలువలు చేస్తున్నారు. సిమెంట్ బ్రిక్స్ కేంద్రాల్లో ఇసుక డంపులు ఉన్నా అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. రోజు రోజుకు వాగుల్లో భూగర్భ జలాలు అంతరిస్తున్న తరుణంలో మండలంలోని పలు ప్రాంతాల్లో ఉన్న వాగులు, వంకల నుండి ఇసుకను తీస్తుండడంతో ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గత మూడు నెలల క్రితం వరకు సమీప వాగుల నుండి కాని, గోదావరి నుండి కాని ఇసుక తీసుకురావలంటే కష్టంగా ఉండేది, అధికారుల కండ్లు కప్పి వారి కదలికలను గమనిస్తూ ఇసుకను తరలిం చే వారు ప్రస్తుత పరిస్థితుల్లో ఇసుక రవాణా దారులకు ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది. మండల కేంద్రం నుంచి ఇంధన్‌పల్లి వైపు వెళ్లే ప్రధాన రహదారి ఇరు వైపులా సిమెంట్ బ్రిక్స్ విచ్చలవిడిగా కనిపిస్తాయి. ఇందులో ఇసుక కుప్పలను చూస్తుంటే కళ్లు జిగెల్లుమనే విధంగా ఇసుక డంపులు కనిపిస్తున్నాయి. మళ్లీ ఆ ఇసుకతో పగలంతా సిమెంటు ఇటుకలు తయారు చేస్తారు. సాయంత్రం వరకు కొంత మట్టుకే అక్కడ ఇసుక కనిపిస్తుంది. మళ్లీ తెల్లవారుజాము నుండి వాగులు, గోదావరి నదుల్లోనుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను సిమెంట్ బ్రిక్స్ కేంద్రాలకు తరలిస్తుంటారు. ఈ వ్యవహారం అంతా ప్రతి రోజు జరుగుతోంది. ఈ ప్రాంతమే కాకుండా కలమడుగు సమీపంలో గల గోదావరి నుంచి ఇసుకను ఇతర ప్రాంతలకు తరలిస్తు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. గోదావరి నుంచి గ్రామంలోకి ఇసుక రావాలంటే గ్రామ సమీ పంలోనే అటవీ శాఖ ఏర్పాటు చేసిన చెక్ పోస్టును దాటి రావల్సిందే కాని అక్కడ ఉన్న సిబ్బంది ఇసుక ట్రాక్టర్లను ఆపకపోవడాన్ని బట్టి చూస్తే అధికారులు ఏమి చేస్తున్నారో అర్థం అవుతుంది. కలమడుగు గోదావరి నుంచి రేవోజీపేట, చెన్నూరు, బుట్టాపూర్, తదితర గ్రామాలకు సైతం విచ్చలవిడిగా ఇసుకను తరలిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.





గ్రామ శివారుల్లో భారీ డంపులు

బాదంపెల్లి గోదావరిలో సైతం ప్రతీ రోజు ఇసుకను తీస్తూ ఆ గ్రామ శివారులో అక్రమ నిలువలు చేసుకొని అధిక మొత్తంలో మండల కేంద్రానికి తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు కాని టైగర్ జోన్‌లో ఎలాంటి నిక్షేపాలు తీయరాదని చెప్పే అటవీ అధికారులు ఏంచేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇంటి నిర్మాణాలకు తెచ్చుకునే ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని రూ.వేలల్లో జరిమానాలు విధిస్తున్నా అటవీ అధికారులు సిమెంట్ బ్రికుక్సు తరలించే ఇసుక ట్రాక్టర్లను పట్టుకోకపోవడం ఏటని పలువురు మిమర్శిస్తున్నారు. మండలంలోని చింతలపల్లి, తిమ్మాపూర్, తపాలాపూర్, ధర్మారం, కన్వాల్, ఇంధన్‌పల్లి, తదితర గ్రామాల సమీపంలో ఉన్న వాగులు, గోదావరి లోనుంచి ఈ ఇసుక దందా యదేచ్ఛగా కొనసాగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.